ఈనాడు
బాపట్ల
సోమవారం అక్టోబరు 21, 2024

చూసిన కనులదే భాగ్యము


అమ్మవారు


కోలాట ప్రదర్శన

అద్దంకి భవానీ కూడలి లోని వింధ్యావాసిని, నగరేశ్వరస్వామి ఆలయం లోని అమ్మవారికి ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకలో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

- న్యూస్‌టుడే, అద్దంకి

పులిచింతలకు వరద ప్రవాహం

అచ్చంపేట, న్యూస్‌టుడే: పులిచింతల ప్రాజెక్టులో రెండోరోజు ఆదివారం వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం రాత్రి 7 గంటలకు ఏడు రేడియల్ గేట్లు ఎత్తి 2,22,720 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తికి 16,000 క్యూసెక్కులు దిగువకు ప్రకాశం బ్యారేజీకి వెళ్తోందని ఏఈఈ రాజు తెలిపారు. ఎగువ నాగార్జునసాగర్ పరివాహక ప్రాంతం నుంచి 2,39,417 క్యూసెక్కులు వచ్చి చేరిందన్నారు. ప్రాజెక్టులో 39.88 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెప్పారు.


బాపట్ల: ప్యాడిసన్‌పేట జగనన్న కాలనీలో ..


చిత్తడిగా మారిన కాలనీ

జగనన్న కాలనీళ్లు

చిత్తడిగా మారిన రహదారులు

తాగునీటి కోసం ఎదురుచూపులు

బాపట్ల, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం జగనన్న కాలనీ వాసుల పాలిట శాపంలా మారింది. రోజూ ఏదో ఒక సమయంలో కురుస్తున్న వర్షాలకు బాపట్ల, రేపల్లెలో పల్లపు ప్రాంతాల్లో ఉన్న జగనన్న కాలనీలు నీట మునిగాయి. బాపట్ల ప్యాడిసన్‌పేటలో పీఎంఏవై (జగనన్న) కాలనీ నీట మునిగింది. రోడ్లపై రెండడుగుల పైగా నీరు నిలిచింది. ఇక్కడ 1872 మంది పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చిన గత పాలకులు మెరకలు వేయలేదు. కాలనీలో కనీస వసతులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నీటి ట్యాంకర్లు బురదతో నిండిన మట్టి రహదారుల్లో బోల్తా పడుతున్నాయి. కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. తాగునీటి కోసం మోకాలిలోతు నీటిలో రెండు కి.మీ. దూరం వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని పంపించారు. కాలనీ వాసులకు తాగునీటి సమస్య పరిష్కరించారు. వర్షాలు ఆగితే మోటార్లు పెట్టి నీటిని తోడిస్తామన్నారు.

❖ రేపల్లె కాలనీలో 2131 మందికి స్థలాలు కేటాయించగా 1131 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. 664 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా పనులు ప్రారంభించనివి 336. ఇక్కడ బురద, నీరు తిష్ట వేసిన రోడ్లపై నడవాలన్నా నరకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇళ్లు నిర్మించుకుంటే సకల సదుపాయాలు కల్పిస్తామని చెప్పి గత వైకాపా ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గృహనిర్మాణశాఖ డీఈ ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణానికి రూ.11.55 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రస్తుత ప్రభుత్వానికి పంపామని తెలిపారు. నిధులు మంజూరైతే అభివృద్ధి పనులు చేయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.


నిలిచిన నీరు, బురద మయమైన అంతర్గత రోడ్లు

విజిలెన్స్ విచారణతో.. హడల్!

❖ పూర్తిస్థాయిలో దస్త్రాలు ఇచ్చేందుకు మీనమేషాలు ❖ నాడు ముడుపులు దండుకుని ప్రస్తుతం విలవిల

- అనుకూలంగా చెప్పాలని అధ్యాపకులకు వేడుకోలు
- ఏఎన్‌యూ ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశం

ఈనాడు-అమరావతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత ఐదేళ్లలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా దూర విద్య (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) పీజీ పరీక్షలు, సీడీసీ తదితర అకడమిక్ విభాగాలతో పాటు ఇంజినీరింగ్ విభాగం పనుల్లో అవినీతి పెద్దఎత్తున జరిగింది. ఆయా విభాగాల్లో ఉన్నతాధికారులుగా పనిచేసిన వారిలో కొందరు బాగానే వెనకేసుకుని విజిలెన్స్ విచారణ అనేసరికి కకావికలమవుతున్నారు. రూ.కోట్ల విలువైన పనులు టెండర్లు లేకుండా నామినేషన్లపై కట్టబెట్టి గుత్తేదారుల నుంచి కమీషన్ల రూపేణా భారీగా లబ్ధి పొందారు. ఈ వ్యవహారాలపై 'ఈనాడు'లో వచ్చిన వరుస కథనాలకు స్పందించి ఇప్పటికే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో జిల్లా విజిలెన్స్ అధికారులు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన పనుల వివరాలను అందజేయాలని వర్సిటీ ఇంజినీర్‌ను కోరగా కొన్ని వివరాలు మాత్రమే ఇచ్చి.. మరికొన్నింటిని పంపలేదు. 2019-24 మధ్య చేపట్టిన అన్ని పనుల టెండర్లు, నామినేషన్లపై చేసిన ప్రతి ఒక్క అంచనా వివరాలు, బిల్లులకు సిఫార్సు చేసిన క్వాలిటీ కంట్రోల్ నివేదికలను అందజేయాలని తాజాగా విజిలెన్స్ ఎస్పీ వర్సిటీ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. అయితే పూర్తిస్థాయిలో రికార్డులు ఇవ్వడానికి తర్జనభర్జన పడుతున్నారు. దస్త్రాలే ఇవ్వడం లేదంటే ఏదో మతలబు ఉండొచ్చని విజిలెన్స్ అధికారులు అనుమానిస్తున్నారు.



పరీక్షలు పెట్టామని చెప్పండి

వైకాపా హయాంలో వర్సిటీ పరిధిలో మూడేళ్ల పాటు బీఈడీ ప్రయోగ పరీక్షలే నిర్వహించలేదు. విశ్వవిద్యాలయం పరిధిలో 100కు పైగా కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో చదివే అత్యధిక విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. ఆయా రాష్ట్రాల నుంచి ప్రాక్టికల్ పరీక్షలు రాయడానికి వస్తే ఇక్కడ హోటల్‌లో బస, భోజనాలు, వచ్చి, పోయేందుకు ఛార్జీలు సగటున ఒక్కో విద్యార్థికి రూ.15 వేల నుంచి రూ.20 వేల దాకా ఖర్చవుతుంది. అందులో సగం మాకిస్తే మేమే వర్సిటీ అధికారులతో లాబీయింగ్ చేసి ప్రాక్టికల్ పరీక్షలు జరపకుండా మేనేజ్ చేస్తామని కాలేజీ యాజమాన్యాలు తొలుత పిల్లల నుంచి సొమ్ము వసూలు చేశాయి. ఆ మొత్తం నుంచి కాలేజీలు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర దాకా వర్సిటీ అధికారులకు ముడుపులు ముట్టజెప్పి వరుసగా మూడేళ్ల పాటు బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించకుండా జాగ్రత్త పడ్డారన్నది బహిరంగ రహస్యమే. అయితే ఈ విషయం నాడు ఉన్నత విద్యామండలి, ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో మా సంగతేమిటని వారు గట్టిగా నిలదీయడంతో కొంత వారికి సమర్పించుకుని ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. మూడేళ్లలో కలిపి రూ.4-5 కోట్ల దాకా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. అప్పటి అక్రమాలపై ప్రస్తుతం విజిలెన్స్ విచారణ జరుగుతోందని తెలుసుకుని పీజీ పరీక్షల విభాగంలో పనిచేసిన నాటి అధికారి ఒకరు హడావుడిగా బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో పాటు అందులో పనిచేసే అధ్యాపకులకు ఫోన్లు చేసి గతంలో ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయా లేదా అని అడిగే అవకాశం ఉంది. ఒకవేళ ఫోన్ చేసి అడిగినా ప్రాక్టికల్ పరీక్షలు పెట్టామని చెప్పండని బతిమిలాడుతున్నారని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. పరీక్షలు పెట్టినట్లు తాము పక్కాగా షెడ్యూల్ రూపొందించామని.. అడిగితే ఆ దస్త్రాలిస్తాం. మీకేం ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. కానీ అధ్యాపకులు అందుకు ససేమిరా అంటున్నారు. మీరు పరీక్ష పెట్టినట్లు షెడ్యూల్ కాపీ అందజేసినా విద్యార్థులకు ఎక్కడ ప్రయోగ పరీక్షలు నిర్వహించారు. వారు ఏ పాఠశాలలో బోధన చేశారు.. అందుకు సంబంధించిన సీడీ ఫైల్స్ కోరితే అంతా దొరికి పోతామని కొందరు పరీక్షలు జరిగినట్లు చెప్పలేమని స్పష్టంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇంజినీరింగ్ పనులపై మాత్రమే విజిలెన్స్ విచారణ జరుగుతున్నా మిగిలిన విభాగాలు అప్రమత్తం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వైకాపాకు గులాంగిరీ చేసి..

వైకాపా హయాంలో వర్సిటీ పరిపాలనా పదవుల్లో పనిచేసిన వారు దీనిని అక్రమాలకు నిలయంగా మార్చేశారనే విమర్శలున్నాయి. సొంత లబ్ధి చూసుకుని వర్సిటీ నియమ నిబంధనలను పట్టించుకోలేదన్న అపవాదు ఉంది. వైకాపా హయాంలో కొందరు అధ్యాపకులు నాటి ప్రభుత్వ పెద్దల పంచన చేరారు. వారంతా ఇప్పుడు హడలిపోతున్నారు. గత పాలకులు వర్సిటీకి చెందిన సుమారు రూ.60-70 కోట్ల నిధులు కరిగించేశారని, వాటిల్లో అత్యధికం దుబారా పనులే ఉన్నాయని తెలుస్తోంది. 20 అడగుల వెడల్పు లేని చోట డివైడర్లు కట్టారు. వాటికి రంగులు అద్దారు. న్యాక్ కమిటీ వస్తుందని చెప్పి శిథిలావస్థలో ఉన్న భవనాలకు పెయింట్లు, టైల్స్ అంటించి రూ.కోట్ల నిధులు మంచినీళ్ల ప్రాయంలా వెచ్చించారు. ఈ క్రమంలోనే నిధులు బాగా దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. వాటన్నింటిపై విచారణ జరుగుతుందని అప్రమత్తమైన నాటి పాలకులు.. విజిలెన్స్ నుంచి మీకు ఎవరికైనా ఫోన్లు చేసి స్టేట్‌మెంట్ల కోసం పిలిచినా.. మాకు వ్యతిరేకంగా చెప్పకూడదని వర్సిటీ పరిధిలోని కాలేజీ యాజమాన్యాలు, అధ్యాపకులకు చెబుతున్నారు. ఇది వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

బాపట్లలో క్రీడా స్టేడియం

➾ ఇరవై ఎకరాల భూమి కోసం అధికారుల అన్వేషణ
➾ కేంద్ర నిధులతో నిర్మాణం

న్యూస్‌టుడే, బాపట్ల

క్రీడలకు సంబంధించి మౌలిక వసతుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. జిల్లా కేంద్రం బాపట్లలో అవుట్‌డోర్ మైదానం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇరవై ఎకరాల భూమిని సేకరించటానికి అధికారులు అన్వేషిస్తున్నారు. కేంద్ర నిధులతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. దీని నిర్మాణం పూర్తయితే క్రీడాకారులు సాధన చేయటానికి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అవకాశం ఏర్పడుతుంది.


బాపట్ల ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో క్రీడా మైదానం

❖ జిల్లాలో 16లక్షల మంది జనాభా ఉన్నారు. అవుట్‌డోర్ పెద్ద క్రీడా మైదానం ఒక్కటీ లేదు. అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలం రావినూతలలో ప్రైవేటు క్రికెట్ మైదానం ఉంది. జిల్లా కేంద్రం బాపట్లలో ఆర్ట్స్, సైన్స్ కళాశాల, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాలలో క్రీడా మైదానాలు ఉన్నాయి. పురపాలక ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం చాలా చిన్నది. చీరాలలో ఎన్ఆర్‌పీఎం ఉన్నత పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాలలో మైదానాలు ఉన్నాయి. బాపట్ల, చీరాలలో మినీ ఇండోర్ స్టేడియాలు ఉన్నాయి. రాష్ట్రస్థాయి అవుట్‌డోర్ గేమ్స్ నిర్వహణకు సరైన మైదానాలు లేవు. పాఠశాలలు, కళాశాలల స్థాయిలో కొన్ని క్రీడలకు మాత్రమే పోటీలు నిర్వహిస్తున్నారు. జాతీయస్థాయి క్రీడాకారుల సాధనకు సరైన జిమ్‌లు అందుబాటులో లేవు.

❖ బాపట్ల మినీ ఇండోర్ స్టేడియంలో మౌలిక వసతుల కల్పనలో గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇండోర్ స్టేడియాలను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వాలని చూసింది. పురపాలక ఉన్నత పాఠశాలలో రూ.రెండు కోట్లతో నిర్మించనున్న ఈతకొలను పనులు రద్దు చేసింది. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంలో నిర్మాణంలో ఉన్న ఈతకొలను పనులు అర్ధంతరంగా నిలిపేసింది. బాపట్ల, చీరాలలో రాష్ట్రస్థాయి క్రీడాకారులు ఉన్నారు. అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు సాధన చేయటానికి వంద, రెండొందలు, నాలుగు వందల మీటర్ల రన్నింగ్ ట్రాక్‌లు లేవు. ఈత కొలను ఉంటే ఈత పోటీల విభాగంలో తీర ప్రాంతం నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. స్టూవర్టుపురంలో వెయిట్‌లిఫ్టింగ్ శిక్షణ అకాడమీని ఏర్పాటు చేయాల్సి ఉంది.

❖ కలెక్టరేట్లో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో క్రీడా మైదానం కోసం భూమిని సేకరించాలని అధికారులను జేసీ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. బాపట్ల పట్టణం, శివారులో అసైన్డ్ భూములు ఉన్నాయి. మైదానంలో రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు, ఫుట్‌బాల్, క్రికెట్ స్టేడియం నిర్మించాలన్న ప్రణాళికలు ఉన్నాయి. భూసేకరణ జరిగి స్టేడియం నిర్మాణం జరిగితే క్రీడల అభివృద్ధికి బాటలు పడినట్లవుతోంది. ఈత కొలనులు సైతం నిర్మిస్తే ఈత పోటీల్లో ఛాంపియన్లు తయారవుతారు. జిల్లా నుంచి ఎక్కువ మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

విధేయతకు ప్రాధాన్యం

➾ కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి
➾ ఎంపిక చేసిన అధిష్ఠానం

గుంటూరు, న్యూస్‌టుడే

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెదేపా సీనియర్‌నేత, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది.. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆలపాటిని ఎంపిక చేసినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. మేలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆలపాటి రాజా తెనాలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాల్సి ఉంది. పొత్తులో భాగంగా ఆ సీటును జనసేనకు కేటాయించారు. అధినాయకత్వం ఆదేశాల మేరకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఈ క్రమంలో గతంలో వాగ్దానం మేరకు అధిష్ఠానం ఆలపాటి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. అధినాయకత్వం ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవడం, విధేయతగా ఉండటం, సీనియర్ నేత కావడం తదితర అంశాలు రాజా వైపే మొగ్గు చూపేందుకు దోహదపడ్డాయి.


ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెలుగు యువత అధ్యక్షుడిగా ప్రస్థానం..

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆలపాటి రాజా పార్టీలో ఏదో ఒక రూపంలో సేవలు అందిస్తున్నారు. ఎన్టీఆర్ తెదేపాను స్థాపించిన సమయానికి ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆలపాటి అప్పట్లో లీగల్‌సెల్ సభ్యులుగా పనిచేశారు. 1989-90 వరకు ఆలపాటి రాజా గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు ఎంపీగా పోటీ చేసిన లాలాజాన్‌బాషాకు చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా సేవలందించారు. 1994, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో వేమూరు నుంచి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆలపాటి ధర్మారావుపై విజయం సాధించారు. 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో రెండోసారి గెలుపొందిన తర్వాత చంద్రబాబు మంత్రి వర్గంలో సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా రెండున్నరరేళ్లపాటు సేవలందించారు. 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించలేకపోయారు. 2014లో తెనాలి నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019లో ఓటమి పాలయ్యారు.

ప్రభుత్వ మంచి పనులే గెలిపిస్తాయి

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించి అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఆలపాటి రాజా ధన్యవాదాలు తెలిపారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో 33 నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ఎంపీల సహాయ సహకారాలు, సమష్టి కృషితో ఎన్నికల్లో విజయం సాధిస్తానన్నారు. రెండు జిల్లాలు రాజకీయంగా ఎంతో చైతన్యమంతమైనవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనతి కాలంలోనే ఎన్నో మంచి పనులు చేపట్టిందన్నారు. అవే నా విజయానికి దోహదపడతాయని ఆలపాటి పేర్కొన్నారు.

క్రికెట్ మైదానం పరిశీలన

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: పర్చూరు వై-జంక్షన్‌లోని క్రికెట్ మైదానాన్ని ఏసీఏ గ్రౌండ్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాధ్యుడు బి.విజయ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. స్థానిక మైదానం జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు అనువైనదిగా ఉంటుందా లేదా అనేది పరిశీలించినట్లు మైదాన ప్రతినిధి ఇంటూరి వంశీకృష్ణ వెల్లడించారు. ఆయన వెంట జిల్లా అసోసియేషన్ నేతలు ఎన్.మోహన్‌రావు, కె.మధు, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

బిల్లుల్లేని వాహనాలు నిలిపివేత

కారంచేడు(మార్టూరు): ఎలాంటి మైనింగ్ బిల్లులు లేకుండా గ్రానైట్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను కారంచేడు పోలీసులు ఆదివారం నిలిపివేశారు. మార్టూరు నుంచి చీరాల వైపు గ్రానైట్ వ్యర్థ రాళ్లను తరలిస్తున్న ఆరు టిప్పర్లను ఎస్సై వెంకట్రావు అదుపులోకి తీసుకుని, విచారించగా ఎలాంటి బిల్లులు లేవని తేలడంతో వాటిని నిలిపివేసి, మైనింగ్ అధికారులకు నివేదించనున్నట్లు వెల్లడించారు.

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

గుంటూరు, న్యూస్‌టుడే: ప్రజలు ప్రశాంతంగా జీవించటానికి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎండనక, వాననక, కష్టపడి పనిచేస్తుంటారు. పగలు, రాత్రి కంటిమీద కునుకులేకుండా కాపాలాకాస్తుంటారు. ప్రజల మాన, ప్రాణాలు కాపాడేక్రమంలో చివరకు ప్రాణత్యాగానికి సైతం వెనకాడరు. విధి నిర్వహణలో తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించే ఏకైక కొలువు పోలీసు ఉద్యోగం. నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం. సంఘ విద్రోహశక్తుల చేతిలో వీరమరణం పొందిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిది.



1975లో తొలి రక్తపుమరకలు : ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో మావోయిస్టుల (నక్సలైట్లు) ప్రభావం తీవ్రంగాఉండేది. వారికి దీటుగా పోలీసులు ధైర్యసాహసాలతో ఎదురొడ్డి పోరాడేవాళ్లు. జిల్లాలో తొలిసారిగా 43 ఏళ్ల కిందట ఖాకీ దుస్తులపై రక్తపుమరకలు అంటుకున్నాయి. 1975లో చెరుకుపల్లిలో నక్సల్స్‌దాడిలో తొలిగా పీసీ దేవదానం మృతి చెందారు. 1992లో రెంటచింతలలో, 2001లో బొల్లాపల్లిలోని రెమిడిచర్లలో, 2002లో, 2003లో దాచేపల్లిలో, 2004లో రెమిడిచర్లలో, 2005లో చిలకలూరిపేటలో ఇలా ఉమ్మడి జిల్లాకు చెందిన మొత్తం 27 మంది పోలీసులు వీరమరణం పొందారు.



పగబట్టిన ప్రకృతి

ఆశలు వదులుకున్న అన్నదాతలు


నగరం శివారు శ్రీనివాసుడి ఆలయం ఎదుట నీట మునిగిన పంట చేలు

నగరం, న్యూస్‌టుడే: ప్రకృతి విపత్తులతో తీరం రైతులు తల్లడిల్లుతున్నారు. బంగాళాఖాతంలో ఆగస్టు చివరి వారంలో ప్రారంభమైన అల్పపీడనాలు నేటికీ వెంటాడుతూనే ఉన్నాయి. నగరం, పూడివాడ, ముత్తుపల్లి, సిరిపూడి, మట్లపూడి, తాడివాకవారిపాలెం, ఈదుపల్లి, తదితర గ్రామాల్లో రైతులు రెండేసి పర్యాయాలు నాట్లు వేశారు. నాట్లు వేసి వెనక్కు తిరక్కముందే వర్షాలకు పంట చేలు ముంపునకు గురవుతున్నాయి. రెండెకరాలు సాగు చేసిన రైతులు ఎకరానికి రూ.22వేల చొప్పున నష్టం చవిచూశారు. దీంతో మూడో పర్యాయం సాగు చేయలేక సార్వా సాగుపై ఆశలు వదులుకున్నారు. విత్తులు విత్తిన సమయంలో నీటి సమస్య వెంటాడింది. ఏదోలా నాట్లు పూరి చేస్తే భారీ వానలు నిండా ముంచేశాయి. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

పురపాలక స్థలం ఆక్రమించి కట్టడం



ఆక్రమించిన స్థలంలో నిర్మిస్తున్న కట్టడం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని శృంగారపురంలో పురపాలక స్థలాన్ని ఆక్రమించి కొందరు దుకాణం నిర్మిస్తున్నారు. తొలుత ఖాళీ స్థలాన్ని కబ్జా చేశారు. ఆ స్థలంలో ఏకంగా దుకాణ నిర్మాణ పనులు ప్రారంభించారు. పురపాలక అధికారులు స్పందించి అక్రమ కట్టడ నిర్మాణ పనులు అడ్డుకుని రూ.లక్షల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను పంపి ఆక్రమ నిర్మాణాన్ని ఆపేయిస్తామన్నారు. పురపాలక స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు.

22న త్రైక్వాండో విశ్వవిద్యాలయం జట్టు ఎంపిక

వేటపాలెం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం త్రైక్వాండో జట్టు ఎంపిక ఈ నెల 22న సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు. ఈ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని జిల్లాల కళాశాలల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నట్లు ప్రధానాచార్యుడు కె.జగదీష్‌బాబు చెప్పారు. క్రీడాకారులకు కళాశాలలో వసతి సౌకర్యం కల్పించనున్నారు. హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా విశ్వవిద్యాలయం రూపొందించిన ఫార్మేట్ అర్హత పత్రంతో పాటు గుర్తింపు కార్డుతో రావాలని పీడీ అన్నం శ్రీనివాసరావు తెలిపారు.

విలువలు పెంపొందించేలా సాహిత్యం



కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఏడీ విష్ణుశరణ్ కరణం, రచయిత మాల్యాద్రిరావు, విజయ్‌కుమార్

బాపట్ల: సమాజంలో విలువలు పెంపొందించేలా సాహిత్యం ఉండాలని విశ్రాంత ఏడీ దర్శి విష్ణుశరణ్ అన్నారు. సాహితీభారతి ఆధ్వర్యంలో భావపురి సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రచయిత మాల్యాద్రిరావు రచించిన 'తొలి పంట' కవితా సంపుటిని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. పోలీసు శాఖ విశ్రాంత సహాయ కమిషనర్ కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక సాహిత్యం ద్వారా భావాభివ్యక్తి చెందాలన్నారు. ప్రముఖ రచయిత మన్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యక్ర, కర్మ, క్రమశిక్షణ కవితా సంపుటి ద్వారా ఆవిష్కరించారన్నారు. ఈ సందర్భంగా రచయిత గొల్లపూడి సీతారాం ఘనంగా సత్కరించారు. సాహితీభారతి అధ్యక్షుడు నరేంద్రనాథ్, కోశాధికారి ఆదం షఫీ, రచయిత వెంకట సనాతన, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి సాయిబాబు, సీనియర్ సిటిజన్స్ సంఘం అధ్యక్షుడు శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత బాపట్ల సైన్స్ కళాశాల

ఏ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆదివారం అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఏఎన్‌యూ వ్యాయామ, ఇంజినీరింగ్, ఆర్‌వీఆర్, జేసీ, బాపట్ల ఇంజినీరింగ్, సైన్స్‌అండ్‌ఆర్ట్స్, ధనలక్ష్మి వ్యాయామ, జేకేసీ కళాశాలల జట్లు పాల్గొన్నాయి. పోటీలను సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వీరయ్య, వ్యాయామ విభాగం సంచాలకులు ఆచార్య పాల్‌కుమార్ ప్రారంభించారు. బాపట్ల సైన్స్ ఆర్ట్స్ కళాశాల ప్రథమ, ఆర్‌వీఆర్ జేసీ కళాశాల, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి.

గుండ్లకమ్మ.. నీటి నిల్వ ఎప్పుడమ్మా?

అద్దంకి, న్యూస్‌టుడే

గుండ్లకమ్మ.. నీలో నీటి నిల్వ చేసేదెప్పుడమ్మా.. అని పరివాహక ప్రజలు ఎదురుచూస్తున్నారు.. గత పాలకుల అంతులేని నిర్లక్ష్యం.. జలాశయం గేట్లు కొట్టుకుపోయే వరకూ సాగింది. ఫలితంగా భారీ వర్షాలు కురిసినప్పుడు జలాశయంలోకి వచ్చే నీరు వృథాగా సముద్రం పాలవుతోంది. ఇప్పటి వరకు వేల క్యూసెక్కుల నీరు ఇలా కడలిలో కలిసిపోయింది. ప్రస్తుతం గేట్ల బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది.

అధిక వర్షాల కారణంగా 2022 ఆగస్టులో 3వ నంబరు గేటు, 2023 డిసెంబరులో గుండ్లకమ్మ జలాశయం రెండో నంబరు గేటు కొట్టుకుపోయాయి. వీటిని బిగించేందుకు అప్పటి వైకాపా ప్రభుత్వ పాలకులు నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు ఐదు టీఎంసీల నీరు సముద్రం పాలైంది. అప్పట్లో ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాడు జలాశయాన్ని పరిశీలించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గేట్లు మరమ్మతులు జరిపిస్తామని చెప్పారు. చెప్పిందే తడవుగా కూటమి అధికారం చేపట్టిన వెంటనే గుత్తేదారుకు నగదు బదలాయించారు. వాస్తవంగా కొట్టుకుపోయినవి రెండు గేట్లే అయినా జలాశయానికి ఉన్న మొత్తం 15 గేట్లకు మరమ్మతులు చేపట్టారు.



గుండ్లకమ్మ జలాశయం రెండు గేట్ల నుంచి వెళుతున్న నీరు

ప్రస్తుతం పదింటికి మరమ్మతులు పూర్తి చేశారు. మరో ఐదింటికి ఆలస్యమయ్యాయి. ఇవి స్టాప్ లాక్ ఆధారంగా నిలిచి ఉన్నాయి. గుజరాత్ నుంచి గేట్లు తీసుకురావటంతో ఆలస్యం నెలకొంది. ఈలోగా తుపాన్, అధిక వర్షాలు సంభవించాయి. దీంతో జలాశయంలోకి వచ్చిన నీరు వచ్చినట్లు 3, 2 నంబరు గేట్ల ద్వారా సంద్రంలోకి వదిలేస్తున్నారు.

జలాశయం నీటి నిల్వ 3.89 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఒక్క టీఎంసీ మాత్రమే ఉంది. దీని పరిధిలో 1.40 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా నీరందని పరిస్థితి. ఆదేవిధంగా దీనిపై ఆధారపడి రెండు వేల మంది మత్స్యకారులు జీవిస్తుండగా గేట్లు కొట్టుకుపోయిన కారణంగా ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకున్నారు. గేట్ల బిగింపు ఎప్పటికి పూర్తవుతుందో.. అని ఎదురుచూస్తున్నారు. నెల రోజులుగా రోజుకు ఐదువేల క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతుండగా.. అది మొత్తం సముద్రానికి వదలడం బాధగా ఉందని జాలర్లు, ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు గేట్లు వస్తున్నాయి

మొత్తం 15 గేట్లలో పది బిగించాల్సి ఉంది. ప్రస్తుతం ఒక్క టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉంది. పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉంచాలంటే మరో రెండు గేట్లు అయినా మరమ్మతులు పూర్తి చేయాలి. ఇప్పటికే గుజరాత్ నుంచి రెండు గేట్లు రవాణాలో ఉన్నాయి. వారం రోజుల్లో అవి జలాశయం వద్దకు చేరతాయి. ఆ రెండు నిలిపినట్లయితే 3.89 టీఎంసీల నీటిని నిల్వ చేయొచ్చు.

- రామాంజనేయులు, ఏఈ, గుండ్లకమ్మ జలాశయం

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఐలవరం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహనరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనె 19 నుంచి 21 వరకు అనంతపురం జిల్లాలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు కె.అనిల్‌కుమార్, కె.రాజశేఖర్, బి.సీతామహాలక్ష్మి, ఎల్.రమ్య, ఇ.హరిణి, వి.రాధికాప్రియ, జి.సాయిసింధూజ, శిక్షణ ఇచ్చిన తుమ్మా శ్రీనివాసరెడ్డిలను అభినందించారు.

బండ్లమ్మ ఆలయాల్లో పూజలు



ప్రసన్న వదనంతో చందోలు బండ్లమ్మ

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజల కష్టాలన్నీ గట్టెక్కి, రైతులకు పాడిపంటలు, భక్త జనులకు అభీష్టం సిద్ధించాలని పూజలు చేశామన్నారు. అమ్మవారిని సువర్ణమాత్రుకా బంగారు కాసుల హారంతో అలకంరించగా ప్రసన్న వదనంతో దర్శనమిచ్చారు. అల్లూరు గ్రామ దేవత అల్లూరుమ్మకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించి పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించారు.

ఇసుక తరలింపు అడ్డగింత



చింతల్లంక సమీపంలో కృష్ణానది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో చింతల్లంక సమీపంలో కృష్ణానదిలో ఇసుక తరలింపును కొందరు గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇసుక నింపుకొనేందుకు ట్రాక్టర్లతో ఇక్కడకు వచ్చిన వారు తిరిగి వెళ్లిపోయారు. అనంతరం చింతల్లంక వాసులు ట్రాక్టర్లు నదిలోకి దిగకుండా దారిలో గండి కొట్టారు. పెసర్లంక సమీపంలోని కృష్ణానదిలో ఇసుక నింపుకొని వెళుతున్న ట్రాక్టర్ల వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు రూ. 500 చొప్పున వసూలు చేయడం, ఇందుకు నిరాకరించిన ఓ ట్రాక్టర్ యజమాని తన వాహనాన్ని లాకుల కూడలిలోని రహదారిలో అడ్డుగా నిలపడంతో ఉద్రిక్తత తలెత్తిన విషయం తెలిసిందే.

8 ఆవులు గోశాలకు తరలింపు

రేపల్లె అర్బన్ : రేపల్లె పట్టణంలో రహదారులపై తిరుగుతున్న 8 ఆవుల్ని తెనాలి, గుంటూరు గోశాలలకు తరలించామని శానిటరీ అధికారి ఆకురాతి రామచంద్రరావు ఆదివారం తెలిపారు. పెద్ద కూరగాయల మార్కెట్, రింగురోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఆవులు తిరగడం వల్ల నిత్యం ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్య తలెత్తుతుందనే ఫిర్యాదులు అందాయి. దీంతో యజమానులకు మైక్, పత్రికల ద్వారా పలుమార్లు తెలియజేసినా ప్రయోజనం లేదు. దీంతో రోడ్లపై సంచరిస్తున్న 25 ఆవుల్ని స్థానిక ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి తరలించారు. ఇది తెలుసుకున్న 17 మంది తమ ఆవులను ఇళ్ల వద్దే కట్టిఉంచుతామని చెప్పి రూ.వెయ్యి చొప్పున అపరాధ రుసుం చెల్లించి వారి గృహాలకు ఆవులను తీసుకెళ్లారని తెలిపారు. రహదారుపై ఆవుల్ని వదిలితే వెంటనే గోశాలకు తరలిస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

నరసరావుపేట అర్బన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా పేర్కొన్నారు. నరసరావుపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, నూతన ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి పెట్టి జీవో 117 రద్దు చేయాలని కోరారు.

విద్యార్థులకు అపార్ సదుపాయాలు

ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

దేశంలో ప్రతి పౌరుడికీ ఆధార్‌కార్డు ఉన్నట్లే ప్రతి విద్యార్థికి 12 అంకెల జీవితకాల గుర్తింపు వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెస్తోంది. ఇందులో భాగంగా ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డును రూపొందిస్తుంది. విద్యార్థుల విద్యాప్రగతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అభ్యసనను మరింత సమర్థంగా నిర్వహించడానికి సహాయపడేలా జాతీయ విద్యా విధానం 2020కు ప్రభుత్వం రూపకల్పన చేసింది. దీని అమలులో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు శాశ్వత విధానంలో గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక కార్డును ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఆధార్ తరహాలో వన్ నేషన్, వన్ స్టూడెంట్ నినాదంతో కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నారు.

ఆధార్ తరహాలో 12 అంకెలతో గుర్తింపు కార్డు



తొమ్మిది నుంచి 12 తరగతులకు..

మొదటి దఫాగా తొమ్మిది నుంచి 12 తరగతుల విద్యార్థుల వివరాలను యూ డైస్‌ప్లస్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, క్యూ ఆర్‌కోడ్, ఫొటో, గ్రేడ్, క్రీడల్లో సాధించిన విజయాలు, వ్యక్తిగత, విద్య సంబంధిత వివరాలు మొదలైనవి డిజిటల్ కార్డులో నమోదు చేస్తారు. విద్యార్థికి సంబంధించిన వివరాలన్నీ ఆ కార్డులో నమోదు చేయడంతో కార్డును స్కాన్ చేస్తే విద్యార్థి మొత్తం వివరాలు వెంటనే తెలుసుకునే అవకాశం ఉంది.

బ్యాంక్ ఖాతాతో అనుసంధానం

విద్యార్థి బ్యాంక్ ఖాతా, డిజీ లాకర్‌తో అపార్‌కార్డు అనుసంధానమై ఉంటుంది. డిజీ లాకర్ వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో పాటు అపార్‌కార్డు కనిపిస్తుంది. తద్వారా వివిధ విద్యా సంస్థలలో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ వంటి సందర్భాల్లో ఈ కార్డు ప్రధానపాత్ర పోషిస్తుంది.

తల్లిదండ్రుల నుంచి అనుమతి తప్పనిసరి..

అపార్ అందించేందుకు తల్లిదండ్రుల నుంచి ముందుగా అనుమతిపత్రం తీసుకోవాలి. 18 ఏళ్లలోపు విద్యార్థులు మైనర్లు కాబట్టి వారి తల్లిదండ్రుల నుంచి సమ్మతి కోరుతూ అనుమతి పత్రాలు తీసుకుంటున్నారు.

నకిలీ ధ్రువపత్రాలకు అవకాశం ఉండదు

'అపార్'తో విద్యార్థులకు సంబంధించి వివరాలు ఒకే ఐడీలో నమోదవుతాయి. ప్రతీ విద్యార్థి అపార్ కార్డు కోసం నమోదు చేసుకోవాలి. కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి ఈ గుర్తింపు సంఖ్య ఇస్తారు. ఒకసారి అపార్ నెంబరు పొందితే వివరాలన్నీ అందులో ఉంటాయి. ఐడీ స్కాన్ చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి. దీంతో నకిలీ ధ్రువపత్రాలకు అవకాశం ఉండదు.

- వుయ్యూరి వెంకటేశ్వరరావు, ఎంఈవో, పీవీపాలెం

అదుపులోకి వంటనూనెల ధరలు

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: భారీగా పెరుగుతూ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్న వంటనూనెల ధరలు రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో కట్టడి అయ్యాయి. ఇటీవల కేంద్రం వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచటంతో తక్కువ వ్యవధిలోనే వంటనూనె ధరలు కిలోకు రూ.10 నుంచి రూ. 25 వరకు పెరిగాయి. ధరలు కట్టడి చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వం దిగుమతిదారులతోనే కాకుండా మండల కేంద్రాల్లోని కిరాణా దుకాణాల యజమానులతో చర్చించి కిలో పామాయిల్ ధర రూ.110, కిలో సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124 చొప్పున అమ్మేలా చర్యలు తీసుకొంది. ఈమేరకు మండల కేంద్రాల్లోని కిరాణా దుకాణాల యజమానులకు ప్రత్యేకంగా ఒక యాప్ అందుబాటులో ఉంచి రేషన్‌కార్డు నంబరు నమోదు చేసుకుని వినియోగదారుడికి నెలకు 3 పామాయిల్, 1 సన్‌ఫ్లవర్ నూనె ప్యాకెట్లు ఇచ్చేలా ఏర్పాటు చేసింది. ఈ ప్రభావం వేరుసెనగ నూనె వంటి ఇతర రకాలపై కూడా చూపటంతో ప్రస్తుతానికి ధరల పెరుగుదల ఆగింది. ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ఈపాటికి వంటనూనెలు కిలోకు రూ.40 నుంచి రూ.50 పైగా పెరిగేవని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

22న శంకరన్ స్మారక సదస్సు

బాపట్ల, న్యూస్‌టుడే: విశ్రాంత ఐఏఎస్ అధికారి శంకరన్ జయంతి సందర్భంగా బాపట్ల పౌర సమాఖ్య, ఎస్ఆర్ శంకరన్ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో బాపట్లలో ఈ నెల 22న శంకరన్ స్మారక సదస్సు నిర్వహిస్తున్నట్లు పౌర సమాఖ్య అధ్యక్షుడు కె.విజయకుమార్ తెలిపారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం-సుపరిపాలన అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో హెచ్‌సీయూ విశ్రాంత వీసీ కె.హరగోపాల్, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎస్.చక్రవర్తి, ఎన్.రమేష్‌కుమార్, ఆర్.సుబ్రహ్మణ్యం, డి.చక్రపాణి ప్రసంగిస్తారన్నారు. కలెక్టర్ వెంకట మురళి సదస్సును ప్రారంభిస్తారన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. పౌర సమాఖ్య కార్యదర్శి శరత్‌బోస్, ప్రతినిధులు సాయిబాబు, జీవీ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక మత్స్యకారుడి ఆత్మహత్య

3చినగంజాం, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక ఓ మత్స్యకారుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చినగంజాం మండలం కోడూరివారిపాలెంలోని సునామీ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్ అందించిన వివరాల ప్రకారం.. కోడూరివారిపాలెం సునామీ కాలనీకి చెందిన చికలకోటి నరసింహ(37) ఆదివారం ఉదయం ఇంట్లోనే ఉరుసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి, అతడ్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు సుబ్బారావు ఆసుపత్రిలో ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

చీరాల అర్బన్, బాపట్ల పట్టణం: వందేభారత్ రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. చీరాల జీఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల రైల్వేస్టేషన్ శివారు చాకలిపాలెం రైల్వే గేటు సమీపంలో సాయంత్రం 5గంటల సమయంలో 50 ఏళ్ల వ్యక్తి పట్టాలపై నడిచి వెళ్తుండగా విజయవాడ వైపు నుంచి చెన్నై వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై కొండయ్య తెలిపారు.

కాలువలో దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బాపట్ల పట్టణం: కాలువలోకి దూకి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఇది. సేకరించిన వివరాల ప్రకారం పట్టణంలో రైలుపేట అద్దాలమేడ ప్రాంతంలో పోస్టాఫీస్ సమీపంలో నివాసం ఉండే దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు స్థానికంగా ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతను ఆదివారం సాయంత్రం మండల పరిధిలో కొండుభొట్లవారిపాలెం సమీపంలో కర్లపాలెం వెళ్లే రోడ్డులో నాగరాజు కాలువ వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. వాహనాన్ని బ్రిడ్జిపై నిలిపి ఒక్కసారిగా కాలువలోకి దూకేశాడు. ఆ సమయంలో చేపలు పడుతున్న జాలర్లు గమనించి నీటిలో మునిగిపోతున్న అతన్ని కాపాడి ఒడ్డుకు చేర్చారు. చికిత్స నిమిత్తం 108లో బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఇతను కొంతకాలంగా చదువుపై ఆసక్తి లేకుండా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై గ్రామీణ పోలీసులు వివరాలు సేకరించారు. ఇంకా కేసు నమోదు చేయలేదు.

విద్యుదాఘాతంతో పెంకుటిల్లు దగ్ధం

అమృతలూరు: మండలంలోని పాంచాళవరంలో విద్యుదాఘాతంతో పెంకుటిల్లు భవనం ఆదివారం దగ్ధమైంది. గ్రామంలో జయమ్మకు చెందిన గృహంలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. జయమ్మ, తన కుమారుడి కుటుంబ సభ్యులు దీనిలో ఉంటారు. ప్రమాద సమయంలో వీరంతా బయటకు వెళ్లారు. అదే సమయంలో ఇంటి నుంచి పొగ, మంటలు రావడం గమనించిన స్థానికులు అదుపు చేసేందుకు యత్నించారు. వంట పాత్రలు, గృహోపకరణాలు, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.1.5లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

డబ్బు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

కొల్లూరు: పెసర్లంక సమీపంలోని కృష్ణానదిలో ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొని, రవాణా చేస్తున్న వాహనాల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేయడంతో పాటు డబ్బు ఇచ్చేందుకు నిరాకరించిన వారిపై దౌర్జన్యానికి దిగిన అదే గ్రామానికి చెందిన సాతా శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏడుకొండలు ఆదివారం తెలిపారు. ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొనేందుకు వెళ్లిన తనను డబ్బులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారని కొల్లూరుకు చెందిన జుజ్జవరపు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 145, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు





జలం వృథా.. పట్టదా?

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో ఉప్పరపాలెం 8వ వార్డులో పబ్లిక్ కుళాయిలకు ట్యాప్ లేకపోవటంతో తాగునీరు వృథాగా పోతోంది. ఒక్కో ట్యాప్ నుంచి రోజూ 400 నుంచి 500 లీటర్ల నీరు వృథా అవుతోంది. అయినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పబ్లిక్ కుళాయిలకు ట్యాప్ మిగించి నీటి వృథా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు హెచ్చరించారు. రేపల్లె సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం పట్టణ రక్షణ నిలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ, గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టించినా, నేరాలకు పాల్పడినా కఠినంగా శిక్షిస్తామన్నారు. ప్రతి కదలికలపై నిఘా ఉంటుందని సత్ప్రవర్తన అలవర్చుకుని సమాజంలో ప్రశాంతంగా జీవించాలని సూచించారు. పట్టణ, గ్రామీణ సీఐలు మల్లికార్జునరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల: 80085 73141, రేపల్లె: 80085 73135, వేమూరు: 91107 837382

? పట్టణంలోని 30వ వార్డులో బాషా ఆసుపత్రి రోడ్డులో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్గంధం వ్యాపిస్తోంది. రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. **- రమేష్, స్థానికుడు**

✔ రహదారి పక్కన వ్యర్థాలు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- ఉమామహేశ్వరరావు, పురపాలక ఏఈ**

- న్యూస్‌టుడే, బాపట్ల

? మండలంలో భవనంవారిపాలెం ప్రధాన రహదారి పక్కన రామాలయం ఎదుట మురుగునీరు నిల్వడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన పశువుల వ్యర్థాలు, చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. **- భక్తులు, భవనంవారిపాలెం**

✔ పరిశీలించి నీరు నిల్వకుండా రోడ్డుకు ఇరువైపులా కచ్చా కాల్వలు తీయించి సమస్య పరిష్కరిస్తాం. **- వసుంధరలక్ష్మి, గ్రామ కార్యదర్శి, భవనంవారిపాలెం**

- న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

? నగరం జియో కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై నిల్వ ఉంటోంది. ఇళ్లలో వాడిన నీరంతా రహదారిపైకి చేరడంతో సీసీ రోడ్డు మురుగు కాలువను తలపిస్తోంది. ఏడాది పొడవునా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. **- లుక్కా మణికంఠ, నగరం**

✔ సంబంధిత అధికారులతో మాట్లాడి అంచనాలు తయారు చేయించి మురుగు కాలువ నిర్మించేందుకు కృషి చేస్తాం. **- బొర్రా శ్రీనివాస్, ఎంపీడీవో, నగరం**

- న్యూస్‌టుడే, నగరం

? మండలంలో బావాజీపాలెం గ్రామంలో సేకరించిన చెత్తను మంచినీటి చెరువు మలుపులో తోటకూరవారిపాలెం వెళ్లే మార్గంలో రహదారి వెంబడి పారపోస్తున్నారు. పాదచారులకు ఇబ్బంది కలుగుతుంది. **- స్థానికుడు, బావాజీపాలెం**

✔ సిబ్బందిని పంపి చెత్త తొలగించి సమస్య లేకుండా చూస్తాం. **- ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బావాజీపాలెం**

- న్యూస్‌టుడే, నిజాంపట్నం

కాగితంతో కళాకృతులు

సృజనకు పదును పెడుతున్న పేటేరు బాలికలు

పేటేరు (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే

రేపల్లె మండలం పేటేరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు చదువు, ఆటల్లోనే కాదు కాగితంతో కళాకృతుల (పేపర్ క్రాఫ్ట్) తయారీలోనూ నైపుణ్యాన్ని ప్రదర్శించి అబ్బురపరుస్తున్నారు. వినూత్నంగా ఆలోచిస్తే ఆకర్షణీయమైన కళాకృతులు తయారు చేయొచ్చని నిరూపిస్తున్నారు. సాయంత్రం బడి నుంచి ఇంటికెళ్లి టీవీ, సెల్‌ఫోన్ చూసేందుకు పరిమితం కాకుండా ఆలోచన శక్తిని పెంపొందించుకోవడంపై దృష్టిసారిస్తున్నారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలు చదివి, హోం వర్క్ పూర్తి చేశాక ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆకృతుల తయారీపై సాధన చేస్తున్నారు. తాము రూపొందించిన వాటితో ఇళ్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆకృతుల తయారీపై ఆసక్తి ఎలా కలిగింది.. దానివల్ల ఏం మేలు జరిగిందో బాలికల మాటల్లోనే తెలుసుకుందాం.

దేవుళ్ల పటాలకు అలంకరిస్తా



కాగితంతో ఆకర్షణీయమైన ఆకృతులు తయారు చేయొచ్చని వృత్తి విద్య శిక్షకురాలు నాగజ్యోతి తెలిపారు. రంగు పేపర్లు కత్తిరించి తయారు చేసే విధానాన్ని వివరించారు. రంగు కాగితాలు, జిగురు, ఖాళీ ప్లాస్టిక్ సీసాలు వినియోగించి పలు రకాల పూలు, పుష్పగుచ్ఛం, పూలదండలు తయారు చేయడం అలవాటు చేసుకున్నా. వాటిని దేవతామూర్తుల పటాలకు అలంకరించి అందంగా ఉండేలా దృష్టిసారించా. నా స్నేహితుల పుట్టినరోజు సందర్భంగా పుష్పగుచ్ఛం బహూకరించి శుభాకాంక్షలు చెబుతాను. **- పువ్వుల అక్షితలక్ష్మి, ఎనిమిదో తరగతి**

ఏకాగ్రత అలవడుతోంది



రంగు పేపర్లతో గోడకు తగిలించే ఆకృతులు, ఫొటోఫ్రేం, రకరకాల పూలు తయారు చేశాను. పాఠశాల ముగిసిన తరువాత ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్ పూర్తి చేసి టీవీ చూసేందుకు పరిమితం కాకుండా ఆకృతులపై సాధన చేస్తున్నా. ఇలా చేయడం వల్ల ఏకాగ్రత, పట్టుదల పెరుగుతోంది. పదోతరగతిలో అధిక మార్కులు పొందగలనన్న ఆత్మవిశ్వాసం కలిగింది. గతంలో సెలవు రోజుల్లో ఎక్కువ సేపు టీవీ చూసేదాన్ని. ఇప్పుడు విరామం దొరికితే చదువుకోవడం లేదా కొత్తగా ఏదైనా తయారు చేయాలన్న ఆలోచన వస్తోంది. **- కొనగాల పూజిత, తొమ్మిదో తరగతి**

సృజనాత్మకత పెరిగింది



చేతివృత్తుల్లో నైపుణ్యం సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతుంటారు. రంగు కాగితాలు అనుకున్న రీతిలో కత్తిరించి ఆకృతిగా రూపొందించే క్రమంలో మనకు ఏదైనా సాధించాలన్న సంకల్పం కలుగుతుంది. మనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందాలన్న తాపత్రయం వృద్ధి చెందడంతో సృజనాత్మకత పెరుగుతోంది. పోటీతత్వం పెరిగి స్నేహితులతో పోటీ పడి చదివి మెరుగైన మార్కులు పొందాలన్న లక్ష్యం బలపడుతుంది. వచ్చే ఏడాది వార్షిక పరీక్షల్లో మొదటి స్థానంలో నిలుస్తానన్న నమ్మకం బలపడింది. **- కేసన గీతశ్రీ, తొమ్మిదో తరగతి**

నవ్యతపై దృష్టి



రంగు కాగితాలతో కళాకృతులు తయారు చేయడంవల్ల పోటీ పడే సామర్థ్యం పెరుగుతోంది. అట్టముక్క, రంగు కాగితాలతో జాతీయ జెండా, రామచిలుక ఆకృతులు తయారు చేశాను. రకరకాల పూలు, గోడలకు తగిలించే బొమ్మలు తయారు చేసి అలంకరించడంతో ఇల్లంతా అందంగా మారింది. ఇంకా కొత్తవి రూపొందించాలన్న ఆలోచన, పట్టుదల పెరుగుతోంది. పనికిరావని పడేసే శీతల పానీయ సీసాలు, కొబ్బరి చిప్పలు, టీ గ్లాసులు, పెళ్లికార్డులు, పేపర్లు వినియోగించి వివిధ కళాకృతుల తయారీపై దృష్టి సారించాను. **- చెన్ను వెంకటజాస్మిత, ఎనిమిదో తరగతి**

సమగ్ర యువజన విధానంతో యువతకు ఉపాధి



మాట్లాడుతున్న లెనిన్‌బాబు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా సమగ్ర యువజన విధానాన్ని అమలు చేసి యువతకు ఉపాధి కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి నక్కీ లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన హామీ అమలు చేయటంలో ఘోరంగా విఫలమైందని, దీంతో యువత నిరుద్యోగులుగా మారారన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.10వేల భృతి కల్పించాలన్నారు. రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీజోన్ చేయాలని, అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో అన్ని జిల్లాల యువతకు ఉపాధి కల్పించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్‌గా మేకల బిజిలీబాబు, కో-కన్వీనర్లుగా డి.రాజారెడ్డి, టి.పూర్ణచంద్రరావును ఎన్నుకున్నారు. సమావేశంలో పలు సంఘాల నాయకులు జేబీ శ్రీధర్, అశోక్, ఫణి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడలో రాష్ట్ర మహాసభలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక 13వ రాష్ట్ర మహాసభలను ఈనెల 21న విజయవాడ గాంధీ నగర్‌లోని కౌతాపూర్ణనంద కళావేదికలో నిర్వహిస్తున్నట్లు చైతన్య వేదిక ప్రతినిధి కోట వెంకటేశ్వర రెడ్డి ఆదివారం తెలిపారు. రాష్ట్ర నలు మూలల నుంచి విచ్చేస్తున్న గాయనీ, గాయకులతో సినీ సంగీత విభావరి ఉంటుందన్నారు.

పచ్చదనం సహజ రక్షక కవచం

బాపట్ల, న్యూస్‌టుడే: పచ్చదనం పుడమికి సహజ రక్షక కవచమని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివనారాయణ అన్నారు. జనసేన ఆధ్వర్యంలో పట్టణంలోని తవ్వకాలువ వద్ద వన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త అయిదు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. హరిత బాపట్లగా తీర్చిదిద్దాలన్నారు. చెట్లను ఎక్కువగా పెంచితే వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు.



అంచుల్లేని దారిలో అపాయం

నిజాంపట్నం, న్యూస్‌టుడే : నిజాంపట్నం పంచాయతీ మిరియాలవారిపాలెం సమీపంలోని ముస్లిం కాలనీకి రేపల్లె ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి ఎన్నికల ముందు హడావుడిగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. కానీ ఇరువైపులా అంచులు నిర్మించలేదు. దాంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో పలువురు కిందపడి గాయాల పాలవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ చక్రవర్తి వద్ద ప్రస్తావించగా గతంలో ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో పనులు చేయలేదని, త్వరలో సమస్య పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

గుబురు తీగలతో గుండెల్లో గుబులు



ఆరేపల్లి, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: విద్యుత్తు స్తంభానికి పిచ్చితీగలు అల్లుకుపోవడంతో రాత్రిళ్లు వీధి దీపాల వెలుగులు కనిపించడం లేదు. దీంతో చీకట్లోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మండలంలో ఆరేపల్లి పంచాయతీ పరిధిలో తూర్పుపాలెం- గుళ్లపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి ఉచావారిపాలెం మీదుగా బలుసులపాలెం రహదారిని కలిపే అనుసంధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. ఈ రహదారి మార్గంలో విద్యుత్తు స్తంభాలకు పలు చోట్ల పిచ్చిమొక్కల తీగలు గుబురుగా అల్లుకుపోవడంతో రాత్రిళ్లు వీధి దీపాలు వెలిగినా, వెలుతురు కనిపించక చీకట్లు కమ్ముకుంటున్నాయి. పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. విషసర్పాలు, కీటకాలతో ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు శాఖాధికారులు ఈ పిచ్చితీగలను తొలగించి విద్యుత్తు స్తంభాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనటంతో పాదచారికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం కర్లపాలెంకు చెందిన వీరాస్వామి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద సాయిబాబా గుడి వైపు ఆదివారం సాయంత్రం నడిచి వెళ్తుండగా అదే మార్గంలో అతివేగంగా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన బాధితుడిని స్థానికులు 108లో బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు అందుకున్న రోహిత సాయి, హిమశ్రీ, ఆర్య

వ్యాసరచనలో అబ్బురపరిచారు

ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల నారాయణ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా 'ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాణించి ఆర్.రోహిత్‌సాయి (పదో తరగతి) ప్రథమ, కె.హిమశ్రీ (తొమ్మిదో తరగతి) ద్వితీయ, డి.ఆర్య (ఎనిమిదో తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ బి.భాగ్యరాణి బహుమతులు అందజేశారు.

ఉపాధి నిధుల సద్వినియోగంతో పల్లెల్లో పండగే

రేపల్లె అర్బన్, బాపట్ల పట్టణం, కర్లపాలెం, కొల్లూరు, న్యూస్‌టుడే: ఉపాధి నిధుల సద్వినియోగంతో గ్రామాల్లో అభివృద్ధి జరిగి పండగ వాతావరణం ఉంటుందని తెదేపా, జనసేన నేతలు అన్నారు. రేపల్లె, బాపట్ల, వేమూరు నియోజకవర్గాల్లో పల్లె పండగ వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రేపల్లె మండలం మోళ్లగుంట, గంగడిపాలెం, పిరాట్లంక, లంకెవానిదిబ్బ పంచాయతీల్లో రూ.60 లక్షల ఉపాధి నిధులతో చేపట్టే సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నాయకులు అనగాని శివప్రసాద్, గుర్రం మురహరిరావు, పార్థసారథి, రాజశేఖర్, శ్రీనివాసరావు, కమతం సాంబశివరావు, విజయకుమారి, రమాదేవి, ఎంపీడీవో శోభారాణి, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఏఈ చక్రవర్తి, ఏపీవో సుబ్బరాజు కార్యదర్శులు పాల్గొన్నారు. బాపట్ల మండలం స్టూవర్టుపురం, వెదుళ్లపల్లి, జిల్లెళ్లమూడి గ్రామాల్లో పల్లె పండగ నిర్వహించారు. జిల్లెళ్లమూడిలో గోకులం షెడ్డు, సీసీ రోడ్డు నిర్మాణానికి జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ భూమి పూజ చేశారు. స్టూవర్టుపురంలో రూ.12.40లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు, వెదుళ్లపల్లిలో రూ.15లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు ఎంపీడీవో బి.బాబూరావు, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, ఏఈ మోహనరావు భూమిపూజ చేశారు. కర్లపాలెం మండలం గణపవరంలో హిందూ శ్మశానవాటికకు వెళ్లే సీసీ రోడ్డుకు తెదేపా, జనసేన నాయకులు, సర్పంచి భూమిపూజ చేశారు. కొల్లూరు మండలంలో కొల్లూరు, రావికంపాడు, బొద్దులూరుపాడులో ఒక్కో గ్రామంలో రూ.9.95లక్షలు, తాడిగిరిపాడులో రూ.9.49 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో నరసింహారావు, సర్పంచులు రామావత్తు విజయ, పోతార్లంక నాగేశ్వరరావు, తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.



బాపట్ల: గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జనసేన నాయకులు



రేపల్లె: భూమిపూజలో తెదేపా నేత శివప్రసాద్ తదితరులు

అధ్వాన పారిశుద్ధ్యం.. అంటురోగాల భయం

● చెరుకుపల్లిని వీడని చెత్త సమస్యలు ● మేలుకోకుంటే ముప్పు తథ్యం

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే

తీరంలో ప్రధాన వాణిజ్య కేంద్రంగా పేరొందిన చెరుకుపల్లిలో అధ్వాన పారిశుద్ధ్యం ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఎక్కడ చూసినా అపరిశుభ్రత దర్శనమిస్తోంది. ఒక్క జాతీయ రహదారి మినహా గ్రామం అంతా ఎటుచూసినా చెత్తాచెదారంతో నిండి ఉంటోంది. ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో సైతం చెత్త నిల్వలు పేరుకుపోయాయి. ఆహారం, కూరగాయలు ఇతర వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వ్యాపిస్తోంది. చెత్త కుండీలు, రోడ్ల వెంబడి పేరుకున్న వ్యర్థాలను వరాహాలు చెల్లాచెదురు చేయడంతో పరిసరాలు మరింత అపరిశుభ్రంగా మారుతున్నాయి. వర్షాలకు చెత్త తడిసి చిత్తడిగా మారుతోంది. ఇలాంటి చోట్ల దోమలు వృద్ధి చెంది ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతిస్తున్నాయి. కొబ్బరి బొండాల డొప్పలు సైతం వీధుల్లో పేరుకుపోయాయి. వీటిలో నీరు నిలిచి దోమల ఉద్ధృతిని మరింత పెంచుతున్నాయి. గతంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం 'ఫ్రైడే.. డ్రై డే' కార్యక్రమం నిర్వహించేవారు. వైకాపా పాలనలో ఇది అటకెక్కింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.



నాయీ బ్రాహ్మణ కాలనీ సమీపంలో చెత్తకుండీ వద్ద దుస్థితి



రహదారి పక్కన ఖాళీ కొబ్బరి డొప్పలు



పోలీస్‌స్టేషన్ వెనుక ఇళ్ల మధ్య వర్షపునీరు, వ్యర్థాలు

చెత్త సేకరణ పెంచాలి

పంచాయతీ పరిధిలో నిత్యం జాతీయ రహదారి, సంతబజారు, కాపులబజారు, కొత్తపేట, గౌడపాలెం తదితర ప్రాంతాలతో పాటు సంపత్‌బాబు నగర్, రామకృష్ణ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లోనే చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోంది. నాయీబ్రాహ్మణ కాలనీ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న చెత్తకుండీలో వ్యర్థాలు పేరుకు పోవడంతో వరాహాలు వాటిని చిందరవందర చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో అన్ని వీధుల్లో చెత్త సేకరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు. శివారు ఇళ్ల వరకు, కాలనీలలో కూడా చెత్త సేకరణ వాహనాలు నడపాలని అప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

వరాహాల కట్టడి ఏది..?

చెరుకుపల్లిలో వరాహాల స్వైరవిహారంతో అధికారులకు తలనొప్పి తప్పడం లేదు. ఎంత కట్టడి చేసినా వాటి నిర్వాహకులు వాటిని రోడ్లపైకి వదులుతున్నారు. దీంతో ఇవి ఇళ్ల మధ్య ఖాళీ ప్రాంతాలు, రోడ్ల పక్కన పడేసిన చెత్తను లాగేసి పరిసరాలను మురికికూపంగా మార్చుతున్నాయి. వీటిని కట్టడి చేస్తే చెరుకుపల్లిలో పారిశుద్ధ్యం బాగుపడుతుందని ప్రజలు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

చెరుకుపల్లిలో మురుగు పారుదలకు ప్రస్తుతానికి ఇబ్బందులు లేవు. నిత్యం అన్ని ప్రాంతాల్లోనూ కార్మికులు చెత్తను సేకరించి ఘన వ్యర్థ కేంద్రానికి తరలిస్తున్నారు. అక్కడక్కడ సమస్యలు ఉంటే వాటిని కూడా పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటాం. వరాహాల విషయంలో వాటి యజమానులకు నోటీసులు ఇస్తాం. వర్షాలు తగ్గగానే అన్ని ప్రాంతాల్లోనూ బ్లీచింగ్ చల్లిస్తాం.

- ఈవూరి విజయబాబు, పంచాయతీ కార్యదర్శి, గుళ్లపల్లి



బాపట్ల: చెరువు కాదు..క్రీడా మైదానం



మరుప్రోలువారిపాలెం- పాండురంగాపురం రోడ్డులో..



సూర్యలంక బీచ్‌కు వెళ్లే దారిలో పై వంతెన కింద..

కుండపోత వర్షంతో అవస్థలు

బాపట్ల, బాపట్ల పట్టణం, వేమూరు, న్యూస్‌టుడే: బాపట్లలో ఆదివారం కుండపోతగా కురిసిన వర్షంతో రహదారులపై మోకాళ్ల లోతు నీరు నిలిచింది. ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మి వర్షం కురవటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోజూ కురుస్తున్న వర్షం వల్ల ఖాళీస్థలాల్లో నీరు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రజలు దోమకాటుకు గురై డెంగీ, మలేరియా, గన్యా, టైఫాయిడ్ జ్వరాల బారినపడే పరిస్థితులు నెలకొన్నాయి. బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం చెరువులా మారింది. గతంలో వేసిన 200 మీటర్ల ట్రాక్ సైతం వర్షానికి దెబ్బతింది. సూర్యలంక రోడ్డులో ఇండియన్ గ్యాస్ గోదాము వద్ద, పై వంతెన కింద వర్షపు నీరు నిలిచి ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలో మరుప్రోలువారిపాలెం-పాండురంగాపురం గ్రామానికి వెళ్లే దారిలో హనుమాన్‌నగర్ వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేమూరు మండల పరిధిలో పలు కాలనీల్లో రోడ్లు జలమయమయ్యాయి. వేమూరు కొత్తకాలనీలో నాలుగు అంతర్గత రోడ్లపై నీరు నిలిచింది. జంపనిలోని ఎస్సీ కాలనీలో మూడు రోడ్లు పంట కాల్వలను తలపించాయి. మాగాణి పొలాల్లో పెద్ద ఎత్తున వర్షపునీరు చేరింది. ప్రస్తుతం పొలాలు పొట్ట, ఈనే దశలో ఉన్నాయి. ఈ సమయంలో వర్షం కురవడం వల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



వేమూరు: జంపని ఎస్సీ కాలనీలో రోడ్లపై నీరు

మినుము రైతుకు ఎంత కష్టం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : కృష్ణానదికి వరద వచ్చి వాణిజ్య పంటలు నష్టపోయాయి. కొంతైనా నష్టాన్ని పూడుద్దామని వరద తగ్గిన తర్వాత రైతులు లంకగ్రామాల్లో మినుము పంట సాగు చేశారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మినుము పైరులోకి నీరు చేరింది. ఇప్పటికే ఎకరాకు రూ.5 వేలకు పైగా ఖర్చులు చేశారు. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు అన్నచందాన లంకగ్రామాల రైతుల పరిస్థితి ఉంది. పైరులో నీరు ఉండటంతో దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయి తేరుకోలేని పరిస్థితి నెలకొంది. ఏటా వరదలు, అధిక వర్షాలకు రైతన్న నష్టపోతూనే ఉన్నాడు. మండల పరిధిలో 500 ఎకరాలకు పైగా మినుము, పెసర పంటలను సాగు చేశారు. ఎడతెరిపి లేని వర్షాలకు ఈ పైరును పూర్తిగా నష్టపోవాల్సిందేనని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



పైరులో వర్షం నీరు

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

నియంత్రణ లేని వీధిదీపాలు



అద్దంకి, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సాయంత్రం ఆరునుంచి ఉదయం ఆరు గంటల వరకు వీధి దీపాలు వెలగాల్సి ఉంది. వీటి నిర్వహణ వ్యవహారం మొత్తం అమరావతి నుంచే కొనసాగుతుండటంతో వెలుగులు ప్రసరించే సమయాలు మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 7.00 గంటలకు పురపాలక కార్యాలయం రోడ్డులో దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. విషయం తెలుసుకున్న కమిషనర్ డి.రవీంద్ర సూచనల మేరకు సిబ్బంది వీధిదీపాలు నిలుపుదల చేశారు.

భవానీకూడలిలో గుంతల పూడ్చివేత



అద్దంకి: పట్టణంలోని భవానీకూడలి వద్ద ఏర్పడిన గోతులను ఆదివారం ఉదయం పూడ్చారు. తక్షణం గుంతలు పూడ్చించాలని మూడు రోజుల క్రితం రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. దీనికి అనుగుణంగా కంకరచిప్స్‌తో వీటిని పూడ్చారు. గుండ్లకమ్మ వంతెనపైన ఏర్పడిన గోతులను త్వరలో పూడుస్తామని ర.భ.శాఖ ఏఈ శివన్నారాయణ తెలిపారు.

పోటీలో ఉంటే పతకమే

క్రీడల్లో రాణిస్తున్న కేజీబీవీ క్రీడాకారిణులు

ఓ వైపు చదువు.. మరోవైపు క్రీడలు.. రెండింటా రాణిస్తున్నారు.. చినగంజాం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న కె.అతల్య, కె.శ్రీవల్లి, కె.తనుశ్రీ, వి.శ్రీలక్ష్మి, 8, 9వ తరగతులు చదివే డి.సింధు, ఎం.ఐశ్వర్య, పి.ప్రజ్ఞలు అండర్-19 విభాగంలో బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, కబడ్డీ తదితర ఆటలు, అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్‌లో జిల్లా స్థాయిలో పలుమార్లు పసిడి పతకాలు సాధించారు. పాఠశాల స్థాయి జోనల్ క్రీడా పోటీలు, సెంట్రల్ పోటీలతో పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, అసోసియేషన్ పోటీల్లో పాల్గొన్నారు. కేజీబీవీ ప్రిన్సిపల్ ఎం.సుమాంజలి, వ్యాయామ ఉపాధ్యాయిని ఎస్.వాణిశ్రీల ప్రోత్సాహంతో జిల్లా స్థాయిలో చూపిన ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

చినగంజాం, న్యూస్‌టుడే



అతల్య | శ్రీవల్లి | తనుశ్రీ | శ్రీలక్ష్మి | సింధు | ఐశ్వర్య | ప్రజ్ఞ

కె.అతల్య స్వగ్రామం ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. గత నెలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన (అండర్-19 విభాగం) జిల్లా స్థాయి పోటీలో టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్‌లో బంగారు పతకాలు సాధించింది. **కె.శ్రీవల్లి** తండ్రి బేలుదారి మేస్త్రి, తల్లి దర్జీ పనిచేస్తారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయిలో బంగారు పతకం సాధించింది. **కె.తనుశ్రీ** ఈదుమూడి స్వగ్రామం. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. సాఫ్ట్‌బాల్‌లో దిట్ట. గత నెలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకుంది. **కె.శ్రీలక్ష్మి** స్వగ్రామం చినగంజాం. తల్లిదండ్రులు వ్యవసాయం కూలీలు. జిల్లా స్థాయిలో రెండుసార్లు బంగారు పతకాలు సాధించింది. అండర్-14 విభాగంలోని అథ్లెటిక్స్‌లో కడవకుదురుకు చెందిన **దైవాల సింధు** రాణిస్తుంది. 8వ తరగతి చదువుతున్న సింధు 600 మీటర్ల పరుగులో నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో 2023లో బంగారు పతకం సాధించింది. 2024లో గుజరాత్‌లో జరిగిన నేషనల్ పోటీల్లో సింధు చూపిన క్రీడా ప్రతిభను గుర్తించి, దిల్లీ స్పోర్ట్సు అకాడమీకి ఎంపిక చేశారు. దూరంగా ఉన్నందున తాము దిల్లీ పంపడానికి తల్లిదండ్రులు ఇష్టపడలేదు. 9వ తరగతి చదువుతున్న **ఎం.ఐశ్వర్య** స్వగ్రామం చినగంజాం. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. లాంగ్ జంప్ జిల్లా స్థాయి పోటీల్లో రెండుసార్లు బంగారు పతకాలు సాధించింది. నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్లకు చెందిన **పి.ప్రజ్ఞ** 100, 200 మీటర్ల పరుగులో రాణిస్తుంది. తండ్రి వ్యవసాయం, తల్లి ఇంటి వద్ద చిన్న అంగడి నిర్వహిస్తారు. ప్రజ్ఞ జిల్లా స్థాయిలో మూడు సార్లు బంగారు పతకాలు సాధించింది. వీరంతా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకున్నారని పీడీ వాణిశ్రీ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? కొత్తపేట పంచాయతీ దీనమ్మ రోడ్డులో సగం వరకే మురుగు కాలువ నిర్మించారు. దీనివల్ల మిగిలిన గృహాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు.

- డాక్టరు సతీష్‌బాబు, స్థానికుడు

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి నిధుల సౌలభ్యం మేరకు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట

? ఇంకొల్లు రక్షిత నాగుల చెరువు ఉత్తరం వైపు గృహాల్లో మురుగు నీరు నేరుగా చెరువులో కలిసి కలుషితమవుతోంది. మురుగు చెరువులోకి రాకుండా కట్టడి చేయాలి.

- ఎన్.వెంకటకృష్ణ, 11వ వార్డు ఇంకొల్లు

✔ చెరువు అభివృద్ధికి అంచనాలు తయారు చేసి ఉన్నాయి. నిధులు మంజూరైన వెంటనే ఉత్తరం వైపు కాలువ నిర్మించి, మురుగు చెరువులో కలవకుండా చర్యలు తీసుకుంటాం.

- వెంకట సుబ్బారెడ్డి, కార్యదర్శి, ఇంకొల్లు పంచాయతీ.

– న్యూస్‌టుడే, ఇంకొల్లు

మురుగు పారదు.. బురద వదలదు

మార్టూరులో జాతీయ రహదారి చెంత చెత్తాచెదారం

మార్టూరు, న్యూస్‌టుడే

చెన్నై-కోల్‌కతా 16వ నంబరు జాతీయ రహదారి పైగ్రానైట్‌కి ప్రధాన వ్యాపార కేంద్రమైన మార్టూరులో మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా మారింది. చినుకురాలితే చిత్తడిగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణ పరిధిలో ప్రమాదాల నివారణకు రెండు కిలోమీటర్ల నిడివితో పై వంతెన నిర్మించారు. వానకురిసే ఈ వంతెన వద్ద నీరుచేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ వంతెనకు తూర్పు, పడమర భాగాల్లో సర్వీస్ రోడ్డు వెంబడి కాలువల్లో మురుగు ప్రవహించక దుర్వాసన వెదజల్లుతోంది. అక్కడ ఏర్పాటు చేసిన కుండీల్లో చెత్తాచెదారం వేయడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. సర్వీసు నీటి పారుదల వ్యవస్థ లోపించడంతో వృథానీరంతా సర్వీసు రోడ్డుపైకి చేరి, పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. గ్రామంలో మురుగు పారేందుకు అనువైన కాలువను ఇప్పటికే నిర్మించకపోవడంతో మార్టూరు వాసులకు శాపంగా మారింది. నివాసాలు, దుకాణాలు ఉన్న వైపు రోడ్డు వెంట మురుగు కాలువలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఇళ్లు, వ్యాపార సంస్థలు, దుకాణదారుల నుంచి బయటకు వచ్చే మురుగు పారుదల ప్రశ్నార్థకమైంది. వేసేదిలేక హైవే ఎక్స్‌ప్రెస్ వంతెన వెంట ఉన్న వాననీటి పారుదల కాలువలోకి బీటీ రోడ్డును పగుల గొట్టి, పైపుల ద్వారా మురుగు నీరు వెళ్లేలా స్థానికులు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. కాలువలో పూడిక పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పడంలేదని వాపోతున్నారు. కొండకుండీల్లో హైవే సేనా మార్గంపైకే మురుగునీరు వదిలేస్తున్నారు. వీటికి చినుకులు రాలిన సమయంలో వాన నీరుతోడై తారు రోడ్లపైకి చేరి చెరువులా మారుతోంది. ఇక్కడ నీటిలో కనిపించని గుంతలతో చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక చిన్నపాటి చినుకులకే తూర్పు భాగాన ఎస్బీఐ సమీపంలో హైవే అండర్‌పాస్ చిన్నపాటి తటాకంలా తయారవుతోంది. ఎన్నిసార్లు పనులు చేపట్టినా పరిస్థితి యథాతథంగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైవే సిబ్బంది మురుగు పారుదలకు కాలువ పనులు చేపట్టినా నీరంతా సర్వీసు రోడ్డుపై నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మార్టూరు తూర్పు భాగాన హైవే సర్వీస్ రోడ్డుపై పేరుకున్న మురుగు



హైవే వంతెన పక్కన చెదారంతో నిండిన కుండీ

అపరిశుభ్రత తాండవిస్తోంది



హైవే సర్వీస్ రోడ్డుపైన ఎక్కడపడితే అక్కడ మురుగు నిలిచి ఉంది. చెత్త కుండీల్లో చెత్తాచెదారం నిండుకోవడంతో ఆప్రాంతమంతా అపరిశుభ్రత తాండవిస్తోంది. హోటళ్లు ఉన్న ప్రాంతాల్లో మురుగునీరు బీటీ రోడ్డుపైకి చేరడంతో తీవ్రదుర్గంధం వెదజల్లుతోంది. అండర్ పాస్‌లో దీపాలు వెలగడం లేదు. వాటికి మరమ్మతులు చేస్తే మహిళలు రాత్రివేళల్లో వంతెనలో నుంచి నడిచి వెళ్లేందుకు ఆందోళన చెందరు. **- జి.శివయ్య, మార్టూరు**

అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

వేటపాలెం, న్యూస్‌టుడే: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న వాయిల వెంకయ్య, వాయిల నందూరావులు అంతర్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు కర్ణ నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు తెలిపారు. రెండు రోజుల క్రితం ఉమ్మడి ప్రకాశం జిల్లా త్రోవగుంట ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలో వీరిద్దరు ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు చెప్పారు. వీరిద్దరినీ ప్రధానోపాధ్యాయుడు ఎం.శేఖరరావు, పాఠశాల కమిటీ ఛైర్మన్ రాంబాబు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

వర్షంతో మినుము పంటకు నష్టం

సంతమాగులూరు, న్యూస్‌టుడే: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం మినుము పంటకు నష్టాన్ని తెచ్చిపెట్టిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 50 ఎకరాలకు పైగా మినుము సాగైంది. వారం రోజులుగా మండలంలో భారీ వర్షం కురుస్తోంది. దీంతోపాటు మిరప 2,500 ఎకరాలకు పైగా సాగైంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఉరకేసే పరిస్థితులు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వల్ల మిరప పైరుతోపాటు మిగిలిన మెట్ట పైర్లలోనూ కలుపు విపరీతంగా పెరిగిందని, తీయడానికి అనుకూలమైన పరిస్థితులు లేకుండా పోయాయని వాపోతున్నారు. ఆదివారం మండలంలో భారీ వర్షం కురిసింది.

టైలర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల పట్టణ కె.స్వామి టైలర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా షేక్ నసీబ్, కార్యదర్శిగా పి.పద్మ, కోశాధికారిగా షేక్ గౌస్ బాషా, గౌరవాధ్యక్షుడిగా అవ్వారు సుబ్రహ్మణ్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి భాస్కరరావు, వివిధ జిల్లాల సంఘాల నాయకులు హాజరయ్యారు.

వేగనిరోధకాలు ఏర్పాటు చేయరూ..



చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన వేగనిరోధకాలు సగానికి పైగా పాడైపోయాయి. వీటిని తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

చినగంజాం, న్యూస్‌టుడే: కొత్తపాలెం శివాలయంలో అయ్యప్పస్వామి పడిపూజా కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తపాలెం, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాలకు చెందిన స్వాములు పాల్గొన్నారు. అనంతరం భిక్ష నిర్వహించారు.

గుమ్మడి సుశీలకు సత్కారం

వేటపాలెం, న్యూస్‌టుడే: పందిళ్లపల్లి శాంతినికేతన్ మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి సుశీలను ఇటీవల జిల్లా మహిళా ఉద్యోగుల వేధింపు నివారణ కమిటీ సభ్యురాలిగా కలెక్టరు నియమించారు. దీన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఆమెను శాలువాతో సత్కరించారు. సంఘ అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీప్రసాదు, డీవీఆర్ నాగరాజు, ప్రత్తి శరత్‌బాబు, బొడ్డు శ్రీనివాసరావు, గద్దె రాఘవ పాల్గొన్నారు.

జల్లు పడితే చెరువే



సోపిరాల సెంటర్‌లో రోడ్డు పక్కన నిలిచిన వర్షపు నీరు

సోపిరాల (చినగంజాం), న్యూస్‌టుడే: సోపిరాల సెంటర్‌లో రోడ్డు పక్కన నిలిచిన వర్షపు నీటితో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. సుమారు మూడు నెలల క్రితం ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.కోట్ల వ్యయంతో తారు రోడ్డు వేశారు. రహదారి నిర్మాణ సమయంలో వర్షాకాలంలో రోడ్డుపై పడే నీరు బయటకు వెళ్లేలా సరైన చర్యలు తీసుకోలేదు. దీంతో చిన్న వర్షానికి రహదారి పక్కన చెరువులా మారుతోంది. ఇక్కడి నుంచే చీరాల, ఒంగోలు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు, హైదరాబాద్ వెళ్లే ప్రైవేటు బస్సుల ప్రయాణికులతో పాటు వందలాది వాహన చోదకులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు దిగాలన్నా, ఎక్కాలన్నా రోజూ విద్యార్థులు, ప్రయాణికులు ఈ నీటిలోనే రాకపోకలు చేయాల్సిన పరిస్థితి. వర్షపు నీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

అల్పాహారం అందజేత

పర్చూరు (మార్టూరు): పర్చూరులో ఆదివారం వృద్ధులకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ సహకారంతో అందించారు.

రక్షిత జలం వృథామయం



మార్టూరులోని తూర్పుబజారు వైపు పశువైద్యశాల వద్ద ఉన్న పంచాయతీ నీటి కుళాయి నుంచి తాగునీరు వృథాగా పోతోంది. కొద్దిరోజులుగా కుళాయికి ట్యాప్ లేకపోవడంతో నీరు అవసరం లేని సమయాల్లో కట్టడి చేయడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానిక ప్రజలు నీరు పట్టుకుని వెళ్లిన పిదప ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి విడుదలయ్యే రక్షిత నీరంతా దీని ద్వారా పక్కనే ఉన్న కాలువలో కలుస్తోంది. ప్రజల గొంతు తడపాల్సిన తాగునీరు కాలువ పాలవడం చూపరులను ఆవేదనకు గురిచేస్తోంది. ఈవిషయాన్ని పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే కుళాయికి ట్యాప్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, మార్టూరు

తెదేపా కార్యకర్త ఖాదర్‌వలి మృతికి సంతాపం

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరుకు చెందిన తెదేపా సీనియర్ కార్యకర్త, కార్పెంటర్ సంఘ మాజీ అధ్యక్షుడు ఎస్‌కె.ఖాదర్ వలి మృతికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం వ్యక్తం చేసినట్లు ఆదివారం పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఖాదర్‌వలి మరణవార్త తెలుసుకున్న మార్టూరు ప్రాంత పార్టీ నాయకులు మృతదేహం వద్ద నివాళులర్పించి ఆయన కుమారుడు, మాజీ ఉప సర్పంచి మస్తాన్‌వలి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అభ్యుదయ రైతు శరత్‌కి పురస్కారం



శరత్‌ని సత్కరిస్తున్న వెంకయ్య నాయుడు తదితరులు

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ, ప్రజలకు నాణ్యమైన పంట ఉత్పత్తులు అందిస్తున్న పెంట్యాల శరత్‌బాబుకు పద్మశ్రీ డాక్టర్ ఐవీ.సుబ్బారావు రైతు నేస్తం పురస్కారం దక్కింది. ఆదివారం గన్నవరం సమీపంలోని ఆత్కూర్, స్వర్ణ భారతి ట్రస్టులో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతులమీదుగా ఇది అందుకున్నట్లు శరత్ వెల్లడించారు. ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం సంయుక్తంగా ఇది చేపట్టినట్లు తెలిపారు. మార్టూరు మండలం బొబ్బేపల్లికి చెందిన శరత్ సాఫ్ట్‌వేర్ కొలువును వదులుకొని ప్రకృతి సేద్యం చేస్తున్నారు. అంతేకాక గ్రామీణ ప్రాంత రైతుల్లో అవగాహనకు నిత్యం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, రైతు నేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి చక్రపాణి పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులతో సర్వతోముఖాభివృద్ధి

జే పంగులూరు, న్యూస్‌టుడే: ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధి సాధ్యం అని ఎంపీడీవో స్వరూపరాణి అన్నారు. పల్లెపండగ - పంచాయతీ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రామంలోని మూడు సిమెంటు రోడ్లు, ఒక గోకులం షెడ్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. సర్పంచి గుడిపూడి నాగేంద్రం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచుప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు పాల్గొన్నారు.

కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే: కారంచేడులో పల్లె పండగలో భాగంగా ఎంపీడీవో నేతాజీ నేతృత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ నిర్వహించారు. గ్రామంలోని రెండు చెరువుల మధ్య ఉన్న రహదారిని రూ.9.5 లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

అద్దంకి సీనియర్ సివిల్ జడ్జీ వారి కోర్టులో

SOP 2/2024

Between:
బూదాటి శ్రీనివాసరావు ...పిటీషనరు
Vs
బూదాటి అప్పారావు వగైరాలు
...రెస్పాండెంట్స్

To R1 to R3

1) బూదాటి అప్పారావు R(1) S/o. గురవయ్య R/o. సజ్జాపురవరం (V), సంతమాగులూరు (M), బాపట్ల జిల్లా

2) గోలి ఆదిలక్ష్మి, W/o. లాజర్ R(2) R/o. గన్నవరం (V), నాదెండ్ల (M), ప్రకాశం జిల్లా

3) ఆమ్‌ఆద్మీ జనరల్ ఇన్సూరెన్సు, నోడల్ ఏజన్సీ లెక్చర్ కమీషనర్, సంతమాగులూరు, R(3)

పై తెల్పిన OPలో నేను పిటీషనర్ అయి ఉన్నాను. ఇందులో ఇంజమూరి అంకమ్మ, W/o. పూర్ణచంద్రరావు, 14-8-2019వ తేదిన మరణించినందున నేను వారసుల పిటీషను కోర్టులో దాఖలు పరిచినందున ఇంకా ఎవరైన ఈమె తరపున వారసులు ఉంటే కోర్టుకు వచ్చి వాదన పెట్టికోవలసినది. అందులకు తెలుగు పత్రిక ద్వారా తెలియపరచటమైనది. ఇందులకు కోర్టు వారి తేది 25-10-2024న హాజరు అయి స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరు కావలసినది. లేనియడల కోర్టు వారు తీర్పునిచ్చెదరు. ఇందుమూలముగా తెలియజేయటమైనది.

వాయిదా: 25-10-2024

శ్రీయుత కోర్టు ఉత్తర్వుల ద్వారా
ఇట్లు : గూడాల అంజిరెడ్డి
పిటీషనరు తరపున న్యాయవాది
20-10-2024

చిన్నకొత్తపల్లిలో వేంకన్న ఆలయం

నేడు స్వామి వారి కల్యాణం, హాజరు కానున్న పలువురు మంత్రులు



నామ్ రహదారిపై వేంకటేశ్వరస్వామి కల్యాణ వేదిక

చిన్నకొత్తపల్లి (అద్దంకి), న్యూస్‌టుడే: నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై చిన్నకొత్తపల్లి సమీపంలో రూ.25 కోట్ల అంచనా వ్యయంతో 'శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానం' నిర్మించనున్నారు. దీనికిగాను ఉదయం 9.10 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి పలువురు అమాత్యులు హాజరుకానున్నట్లు శ్రీయాన్ ఛారిటబుల్ ట్రస్టు తరపున దేవినేని లక్ష్మీనారాయణ సోదరులు వెల్లడించారు. సుమారు మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రీయ రహదారిపై చిన్నకొత్తపల్లి మలుపు వద్ద అధికంగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ గుడి నిర్మాణంతో అనేక సమస్యలు తీరే అవకాశం ఉందని భావించి, ఈ చర్యకు శ్రీకారం పలికినట్లు నిర్వాహకులు తెలిపారు. శంకుస్థాపన అనంతరం స్వామి వారి కల్యాణ వేడుకలు జరుగుతాయని ప్రచారం చేస్తున్నారు. దీనికోసం యాగశాల, కల్యాణ వేదిక సిద్ధం చేశారు.

అక్షర భగీరథుడు రావూరి



భరద్వాజ పురస్కారాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, న్యూస్‌టుడే: కలాన్ని కన్నీళ్లతో నింపి సాహిత్య సుగంధాలు వెదజల్లిన అక్షర భగీరథుడు రావూరి భరద్వాజ అని వక్తలు పేర్కొన్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ వర్ధంతి సభ ఆదివారం వృద్ధుల సంక్షేమ భవనంలో నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపళ్లు బత్తుల బ్రహ్మారెడ్డి, ఎ.నాగవీరభద్రాచారి తదితరులు మాట్లాడుతూ కేవలం పదో తరగతి చదివిన భరద్వాజ అద్భుతమైన రచనలు చేయటం, ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. అనంతరం కవి, గేయ రచయిత కర్ణ సుబ్బారావుకు డాక్టర్ రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ ఉమా రాఘవేంద్ర, రాజ్‌వినయ్‌కుమార్, వడలి రాధాకృష్ణ, ఏకాంబరేశ్వరబాబు, హరిహరప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

అనుమానాలు నివృత్తి చేయాలి

చీరాల, న్యూస్‌టుడే: వేటపాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన పులి శ్రీనివాసరావు మృతిపై కుటుంబ సభ్యులు, బంధువులకు ఉన్న అనుమానాలను పోలీసులు నివృత్తి చేయాలని మాజీ ఎంపీ చిమటాసాంబు అన్నారు. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించి, ఓదార్చారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు(మార్టూరు): మండలంలోని నూతలపాడుకు చెందిన ఎన్.మస్తాన్‌వలి (35) చికిత్స పొందుతూ మృతిచెందాడని ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం పోలీసులు వెల్లడించారు. అనారోగ్య కారణాలతో పురుగు మందు తాగాడని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు.

శింగరకొండ మలుపులో మరమ్మతులు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి నామ్ రహదారికి అనుసంధానంగా ఉన్న రోడు విస్తరణకు దాతలు ముందుకొచ్చారు. చక్రాయపాలెం, గోపాలపురం గ్రామాలకు చెందిన దాతలు స్పందించి రూ.25 వేల అంచనా వ్యయంతో భవనాశి తటాకం దిగువ అంచు నుంచి నామ్ రహదారి వరకు సుమారు 50 మీటర్ల పొడవున గుంతలు పూడ్చివేశారు. అంచుల్లో మట్టి తొలగించి, తారుతో విస్తరించారు. దీంతో భవనాశి తటాకం దిగువ భాగం కొంతమేర మెరుగుపడినట్లయింది.